క్లుప్తంగా

కారుణ్య నియామకం



నెల్లూరు(సెంట్రల్): కారుణ్య నియామకం కింద జిల్లా రిజిస్ట్రేషన్ శాఖలో గోళ్ల జితేంద్రబాబుకు ఉద్యోగావకాశం కల్పించినట్లు జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు సోమవారం తెలిపారు. కలెక్టర్ హరినారాయణన్ ఆదేశాల మేరకు నెల్లూరు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జూనియర్ సహాయకుడిగా నియమించి యామక ఉత్తర్వులు అందజేసినట్లు వివరించారు.

యువకుడికి దేహశుద్ధి

నెల్లూరు(క్రైమ్): నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్ సమీపంలో సోమవారం చిరువ్యాపారుల వద్ద నగదు లాక్కుని పరుగులు తీస్తున్న ఓ యువకుడ్ని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసుల సహకారంతో యువకుడ్ని చిన్నబజారు పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారిస్తున్నారు.

జోనల్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు బుజబుజనెల్లూరులోని ఏసీఐ స్టేడియంలో సోమవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ ఎం శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పశువైద్య దినోత్సవంలో భాగంగా అంతర్ జిల్లాల జోనల్ స్థాయి క్రికెట్ పోటీలను నెల్లూరులో నిర్వహించడం అభినందనీయమన్నారు. నిత్యం పనిఒత్తిడిలో ఉండే తమ శాఖ ఉద్యోగుల మానసిక, శారీరక ఆరోగ్యానికి టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. జోన్-3 నుంచి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, జోన్-4 నుంచి వైఎస్సార్ కడప, కర్నూలు జిల్లాల పశువైద్యులు/సహాయ సంచాలకుల స్థాయి అధికారులు పోటీలకు హాజరయ్యారు. నెల్లూరు జిల్లా జట్టుకు డాక్టర్ మదన్‌మోహన్, వైఎస్సార్ జిల్లాకు డాక్టర్ మంగేష్, ప్రకాశం జిల్లాకు డాక్టర్ విశ్వంరెడ్డి, కర్నూలు జిల్లాకు డాక్టర్ నిత్యశ్రీనివాస్ కెప్టెన్లుగా వ్యవహించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ డాక్టర్ ఆర్.వసంతరాయులు, జిల్లా పశుసంవర్థక శాఖాధికారి డాక్టర్ మహేశ్వరుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకు వినతి

నెల్లూరు(క్రైమ్): గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళెం గ్రామస్తులు ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డికి సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తులు గ్రామంలో చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతూ భయాందోళనలకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి

మనుబోలు : స్థానిక బీసీ కాలనీకి చెందిన కొమరాల నరసమ్మ(85) వడదెబ్బకు గురై ఆదివారం రాత్రి మృతి చెందింది. వడదెబ్బకు గురైన నరసమ్మను బంధువులు 108లో నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సర్జికల్ వార్డులో అడ్మిట్ చేసి వైద్య సిబ్బంది చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

వైభవంగా అవతార ఉత్సవాలు

నెల్లూరు(బృందావనం):రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో భగవద్రామానుజాచార్యుల అవతార ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రామానుజాచార్యులకు సోమవారం ఉదయం మంగళ శాసనోత్సవం, పేట ఉత్సవం, తిరుమంజనం నిర్వహించారు. రాత్రి సేవాకాలం, శాత్తుమొర్రై జరిపారు. ఉభయకర్తలుగా నూకల సీతమ్మ, పేటేటి సుబ్బరాయలుశెట్టి తరుపున దేవస్థానం వ్యవహరించింది. ఆలయ ఈఓ డీ వెంకటేశ్వర్లు, చైర్మన్ ఐ శివకుమార్‌ఆచారి, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



భగవద్రామానుజాచార్యులకు సేవాకాలం

లలితాదేవిగా శ్రీమహాలక్ష్మి

నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని శ్రీమహాలక్ష్మి దేవస్థానంలో వార్షిక వసంత పరిమళ కొతాయి మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం శ్రీమహాలక్ష్మి అమ్మవారు శ్రీలలితాదేవి అలంకారంలో భక్తులను కరుణించారు. వేదం సుబ్బరామశాస్త్రి శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలుస్వీకరించారు. ఉభయకర్తలుగా దుగ్గిశెట్టి రమేష్‌బాబు, జయంతి దంపతులు వ్యవహరించారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు శ్రీరాంవెంకటసురేష్, చిన్నిరవి, పెసల నరేంద్రప్రసాద్, సరాబు బాలాజీ, పప్పులవీధి మిత్రమండలి, మహిళా మండలి, ఆలయ ఈఓ పీవీకే హేమచంద్రరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ముగిసిన జిల్లా క్యారమ్ ర్యాంకింగ్ టోర్నమెంట్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): దర్గామిట్టలోని నెల్లూరు క్లబ్ నందు జిల్లా క్యారమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లా క్యారమ్ ర్యాంకింగ్ టోర్నమెంట్-2023 పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ టోర్నమెంట్‌లో 1వ ర్యాంకు ఎం అనంతనాథ్ రెడ్డి, 2వ ర్యాంకు ఎం సుధాకర్, 3వ ర్యాంకు ఎస్‌కే మహబూబ్‌బాషా సాధించారు. మొత్తం 10 ర్యాంకులు ప్రకటించారు. ఏపీఎస్పీడీసీఎల్ సీజీఎం కే విజయ్‌కుమార్‌రెడ్డి, ఒంగోలు ట్రాన్స్‌కో ఎస్ఈ బీవీ శేషారెడ్డి, తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరై విజేతలకు సర్టిఫికెట్లు, నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని తెలిపారు. క్యారమ్ పోటీలను చక్కగా నిర్వహించిన అసోసియేషన్ నాయకులను అభినందించారు. సీనియర్ న్యాయవాది మలిరెడ్డి కోటారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో క్యారమ్ క్రీడాకారులకు తాము ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. మే నెలలో స్థానిక వాగ్దా స్కూల్లో క్యారమ్ సమ్మర్ క్యాంపు నిర్వహిస్తామని ఆ పాఠశాల కరస్పాండెంట్ పీ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు పీఆర్ క్లబ్ అధ్యక్షుడు కోడూరు వీరారెడ్డి, నెల్లూరు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, జిల్లా క్యారమ్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీమన్నారాయణ, శ్రీధర్ పాల్గొన్నారు.



విజేతలకు సర్టిఫికెట్లు, నగదు బహుమతుల ప్రదానం

ఉత్తమ పంచాయతీలకు పురస్కారాలు



సర్పంచ్‌లకు సన్మానం

నెల్లూరు రూరల్: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలో 18 పంచాయతీలు ఉండగా, మండల స్థాయిలో వివిధ అంశాల్లో 8 పంచాయతీలను ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక చేసి అవార్డులను ప్రకటించారు. ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన కొండ్లపూడి, కొమ్మరపూడి, ములుముడి, సౌత్‌మోపూరు, ఉప్పుటూరు, గొల్లకందుకూరు, కాకుపల్లి, కలివెలపాళెం పంచాయతీల సర్పంచ్‌లను శాలువాలతో సత్కరించి అవార్డులను అందజేశారు. రూరల్ ఎంపీపీ విజయకుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్, ఈఓపీఆర్డీ జలజాక్షి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయిబాబా ఆరాధనోత్సవం

నెల్లూరు(బృందావనం): భక్తవత్సలనగర్‌లోని శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయిబాబా 12వ ఆరాధనోత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ట్రస్టు అధ్యక్షుడు శ్రీరామరాజు మాట్లాడుతూ సత్యసాయిబాబా కులమతాలకు అతీతంగా ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి ఆధ్యాత్మిక గురువుగా నిలిచారన్నారు. దైవాంశ సంభూతిగా ఆయన చేపట్టిన సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎనలేనివిగా వివరించారు. ట్రస్టు కార్యదర్శి కే మురళీమోహన్‌రాజు, సభ్యులు వెన్నపూస మల్లారెడ్డి, దండు ధర్మారెడ్డి, చల్లా వెంకటరాముడు, రాజారెడ్డి, అల్లూరి రాజేష్ రాజు, శ్రీకాంత్, ప్రసాద్, జీవీ మహేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు



నేడు శ్వేతఛత్ర ఉత్సవం

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో భగవద్రామానుజాచార్యుల వారి తిరునక్షత్రం సందర్భంగా మంగళవారం విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ డీ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఐ శివకుమార్‌ఆచారి సోమవారం తెలిపారు. ఉదయం 5.30 గంటలకు శ్రీరామానుజాచార్యులకు శ్వేతఛత్ర(గొడుగుల) ఉత్సవం, 8.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి, శ్రీరామానుజాచార్యులకు తిరుమంజనం, రాత్రి 7గంటలకు రంగనాథస్వామికి పెద్ద శేష వాహన సేవ, రామానుజాచార్యులకు చిన్నశేష వాహన సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

కమిషనర్‌ను కలిసిన ఎన్‌జీఓ నాయకులు

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ నూతన కమిషనర్ వికాస్‌మర్మత్‌ను ఆయన చాంబర్‌లో ఎన్‌జీఓ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మనేపల్లి పెంచలరావునాయుడు, వెంకటస్వామి ఆధ్వర్యంలో కమిషనర్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ జిల్లా కోశాధికారి బండారుపల్లి వెంకటేశ్వర్లు, అర్గనైజింగ్ కార్యదర్శి గాదిరాజురామకృష్ణ, ఉపాధ్యక్షురాలు కరుణమ్మ, కృష్ణంరాజు, కృష్ణకుమార్, విజయ్‌కుమార్, రాజేంద్రప్రసాద్, నెల్లూరు నగర అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కార్యదర్శి మార్కండేయులు, తదితరులు పాల్గొన్నారు.



మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (టౌన్): మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యాన్ని నగరంలోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై మాజీ ఎమ్మెల్సీతో చర్చించినట్లు చెప్పారు. భవిష్యత్తులో ఆయన సలహాలు తీసుకుని ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నెల్లూరు(బృందావనం): తిక్కన పార్కు వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని రంగనాయకులపేటలోని ది ఆర్యవైశ్య నెల్లూరు బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ కల్యాణమండపంలో ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక, సామాజిక సేవా రంగాల్లో విశిష్ట సేవలందించిన నెల్లూరీయులను సత్కరించారు. వివిధ రంగాలు, అసోసియేషన్లకు చెందిన నిర్వాహకులు గాదంశెట్టి గోపాల్, బయ్యా వాసు, కొలిపాకుల సుబ్రహ్మణ్యం, సోమిశెట్టి సురేష్, తదితరులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి పోటీలకు ఓవెల్ విద్యార్థి

నెల్లూరు (టౌన్): జాతీయ స్థాయి జూనియర్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు ఓవెల్ స్కూల్ విద్యార్థి సిద్ధార్థ ఎంపికైనట్లు ఓవెల్ విద్యాసంస్థల డైరెక్టర్ వేణు తెలిపారు. 9వ రాష్ట్రస్థాయి జూనియర్ టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో జిల్లా బాలుర క్రికెట్ జట్టుకు సిద్ధార్థ సారథ్యం వహించాడని చెప్పారు. బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి ఆల్‌రౌండర్‌గా రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడని వివరించారు. మే 17 నుంచి 19వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆగ్రాలో జరుగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సీఈఓ ప్రమీల, జీఎం మహాదేవయ్య, ప్రిన్సిపల్ బాలు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

సర్వమానవాళికి మార్గదర్శకం భగవద్గీత

నెల్లూరు(బృందావనం): సర్వమానవాళికి సంబంధించిన జ్ఞానం భగవద్గీతలో నిక్షిప్తమై ఉందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి నెల్లూరు కమిటీ అధ్యక్షుడు సురమౌళి తెలిపారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాల పరిచయ,ప్రచార కార్యక్రమాన్ని మూలాపేటలో ప్రాంతంలో సోమవారం నిర్వహించారు. కమిటీ సభ్యులు జీ నరసింహప్రసాద్, కేవీ రత్నం, పీ శేషారత్నం, ఎం నారాయణమ్మ, కే విజయలక్ష్మి, సీహెచ్ సుమలత, ఎం సోమశేఖర్, పీ ప్రదీప్, సీహెచ్ సునీల్, తదితరులు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని కిసాన్‌నగర్, రైతుబజారు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని నెల్లూరుటౌన్-2 విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్నార్, బోడిగాడితోట విద్యుత్ ఫీడర్ల పరిధిలో మైపాడు రోడ్డు విస్తరణలో భాగంగా నూతనంగా విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నందున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామని చెప్పారు. బోడిగాడితోట, వైకుంఠపురం, సత్యనారాయణపురం, జాకీర్‌హుస్సేన్‌నగర్, శ్రీనివాసనగర్, మైపాడురోడ్డు, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని వినియోగదారులు సహకరించాలని కోరారు.

- ఎంజీనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సరస్వతీనగర్ విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని నెల్లూరు వెస్ట్-1 విద్యుత్‌శాఖ ఏఈ లక్ష్మీబాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని క్రాంతినగర్, సరస్వతీనగర్, మాగుంట నివాసం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని, వినియోగదారులు సహకరించాలని కోరారు.
- నగరంలోని తెలుగుగంగ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ నేతాజీనగర్ విద్యుత్ ఫీడర్‌లో నూతనంగా విద్యుత్ టవర్స్ నిర్మాణ పనులు చేపడుతున్న కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని ఐఈ సెక్షన్ విద్యుత్‌శాఖ ఏఈ లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు. ఎన్‌సీసీ కాలనీ, డైకస్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాలిక పరార్

నెల్లూరు(క్రైమ్): ఇంట్లోని నగదు, బంగారు, వెండి ఆభరణాలతో బాలిక ఇంట్లో నుంచి పరారైన ఘటనపై దర్గామిట్ట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు...అన్నమయ్యసర్కిల్ సమీప గిరిజన కాలనీలో ఓ మహిళ తన కుటుంబంతో నివాసం ఉంటోంది. ఆమె కుమార్తె పదో తరగతి వరకు చదువుకుంది. పరీక్షల్లో తప్పడంతో ఇంటి వద్దే చదువుకుంటోంది. ఈ నెల 23న మహిళ పనికి వెళ్లగా, కుమార్తె ఇంట్లో ఒంటరిగా ఉంది. పక్క వీధిలో నివాసం ఉంటున్న మహిళ తల్లి ఇంటికొచ్చి బాలిక వద్ద కూర పెట్టించుకుని వెళ్లింది. తిరిగి ఆమె సాయంత్రం వచ్చి చూడగా బాలిక కనిపించలేదు. దీంతో మనుమరాలు కనిపించలేదన్న విషయాన్ని ఆమె తన కుమార్తెకు ఫోన్‌లో తెలియజేసింది. మహిళ పనినుంచి ఇంటికొచ్చి కుమార్తె కోసం చుట్టుపక్కల గాలించిన జాడ తెలియరాలేదు. బీరువాలోని రూ 43వేల నగదు, బంగారు మాటీలు, కమ్మలు, ఉంగరం, వెండిపట్టీలు కనిపించలేదు. ఈ మేరకు బాధిత తల్లి దర్గామిట్ట పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.